# పత్రికాప్రకటన

16.08.2018

మత్స్యకారుల కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూర్చేందుకు చేపట్టిన సమీకృత మత్స్య అభివృద్ధి పథకాన్ని మరింత వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమల అభివృద్ధి మరియు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి శ్రీ తలసాని శ్రీనివాసయాదవ్ మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయం నుండి మంత్రి శ్రీనివాసయాదవ్ పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణలతో కలసి వివిధ జిల్లాల మత్స్యశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వివిధ జిల్లాలలో 25 వేల నుండి 30 వేల వరకు ధరఖాస్తులను జిల్లాస్థాయి కమిటీలు ఎంపిక చేయాల్సి ఉందన్నారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల నుండి వారి వాటాధనాన్ని వారం రోజులలోకి సేకరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 1,46,739 మంది లబ్ధిదారులకు గాను ఇప్పటి వరకు కేవలం 10,922 మంది వద్ద నుండి మాత్రమే వాటా ధనాన్ని వసూలు చేయడం జరిగినట్లు ఆయన వివరించారు. ఈ పథకంలో భాగంగా రాష్ట్రస్థాయి కమిటీలు ఎంపిక చేయాల్సిన ధరఖాస్తులను ఒక్కటి కూడా ఇంతవరకు పంపలేదన్నారు. వాటాధనం చెల్లించిన వారికి గ్రౌండింగ్ చేపట్టాలని అన్నారు. ఈ సంవత్సరం 81 కోట్ల చేపపిల్లలను విడుదల చేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని, చేపపిల్లల విడుదల కార్యక్రమాన్ని వనపర్తి జిల్లాలో లాంచనంగా ప్రారంభించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. నీటినిల్వలు ఉన్న చెరువులు, కుంటలలో చేపపిల్లలను విడుదల చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్న చేపపిల్లలను మాత్రమే విడుదల చేయాలని మంత్రి స్పష్టం చేశారు. సైజు, క్వాలిటీ, చేపపిల్లల లెక్కింపు లో రాజీపడవద్దని, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే ఖచ్చితంగా తిరస్కరించాలని ఆదేశించారు. జోగులాంబగద్వాలలో సైజు తక్కువ కలిగిన చేపపిల్లలను సరఫరా చేయడంతో వాటిని విడుదల చేయకుండా వెనక్కు పంపామని, చేపపిల్లల సరఫరా దారుడికి నోటీసులు జారీచేయాలని ఆ జిల్లా అధికారిని ఆదేశించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. చేపపిల్లల విడుదల సమయంలో స్థానికంగా ఉండే మత్స్యకారులను

అందరిని ఆహ్వానించాలని, వీడియో చిత్రీకరణ చేసి ప్రధానకార్యాలయానికి పంపించాలని మంత్రి శ్రీనివాసయాదవ్ అధికారులకు సూచించారు. చేపపిల్లల ఎంపిక విషయంలో అధికారులు ఖచ్చితంగా ప్రత్యేకశ్రద్ధ చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటి వరకు 144 చెరువులలో 76 లక్షల చేపపిల్లలను విడుదల చేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమాల అమలులో ఎక్కడా విమర్శలకు తావులేకుండా జాగ్రత్తపడాల్సి ఉందని ఆయన తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మత్స్యకారుల సంక్షేమంకోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, వీటిపై మత్స్యకారులకు విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి ఒక్క మత్స్యకారుడి కుటుంబానికి లబ్ధి అందే విధంగా చూడాల్సిన బాధ్యత మీపై ఉన్నదని మంత్రి అధికారులకు సూచించారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న చేపలచెరువులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు.